క్లుప్తంగా

మైనర్లకు వాహనాలిస్తే కేసు నమోదు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎస్సై రాము ఆధ్వర్యంలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి పట్టణ సీఐ రాంచందర్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. అలాగే తమ పిల్లలకు వాహనాలివ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా చూసుకోవాలని, వాహనానికి ఇన్సూరెన్స్ ఉండేలా యజమాని చూసుకోవాలన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

గొల్లపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మధ్య దలారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, చెందోళి సొసైటీ చైర్మన్ మాధవరావు, వైస్ చైర్మన్ నవ్వ తిరుపతి, సర్పంచ్ ముస్కు నిషాంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్ పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించాలి



పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి బాలే శివాజీ

ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ కోరారు. మండలంలోని ఎర్దండిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మూలరాంపూర్‌లో వృక్షమాల కింద మొక్కలు నాటేందుకు గోదావరి పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్ పాల్గొన్నారు.

కుజదోష నివారణ పూజలు



ధర్మపురిలో కుజదోష నివారణ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలతో కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారు కుజదోష నివారణకు పూజలు చేయించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ప్రధాన ఆలయం,అనుబంధ ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.

ధర్మపురికి నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దర్శనం కోసం బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వి. సునీతా లక్ష్మారెడ్డితో పాటు సభ్యులు రానున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. రాత్రి ధర్మపురిలో బస చేసి గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు.

ఇంటి ముందు ఖాళీ జాగాకూ పన్ను

- మున్సిపాలిటీలో పెరగనున్న పన్ను భారం
- నూతన విధానం అమలులోకి
- భువన్ సర్వేతో పన్నుల మోత



రాయికల్: భువన్ సర్వేతో మున్సిపల్‌లో ఇప్పటికే పన్నుల మోత మోగుతోంది. నూతన పురపాలక చట్టం 2019 ప్రకారం ఆస్తి పన్నులు నమోదు చేయడంతో పన్ను దారులు లబోదిబోమంటున్నారు. ఇటీవల భువన్ సర్వే నమోదు పూర్తి చేసి మున్సిపల్ అధికారులు పన్నులు విధించారు. ప్రస్తుతం ఈ ఆర్థిక సంవత్సరంలో భువన్ సర్వేతో పూర్తిచేసిన పన్నుల విధానాన్ని అమలు చేయడంతో ఇంటి నిర్మాణాల కొలతల ఆధారంగా పన్నులు వసూలు చేస్తున్నారు. తాజాగా ఇంటి ఆవరణలో ఖాళీ స్థలానికి కూడా పన్ను విధించే విధానాన్ని కొత్త సాఫ్ట్‌వేర్‌లో రూపొందించింది. దీంతో మున్సిపాలిటీలో గృహ యజమానులకు మరింత భారం పడనుంది. మరోవైపు ఆస్తి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నమోదైన విలువ ఆధారంగా వీటి విలువను పరిగణలోకి తీసుకోవడంతో పన్నుల విలువ మరింత పెరిగిపోయింది. ఇలా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో వార్డుల్లోని ఇంటిని నమోదు చేస్తే చాలు పన్ను ఎంతమొత్తం వసూలు చేయాలో ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా లెక్కిస్తున్నారు. గతంలో కేవలం మున్సిపల్ అధికారులు ఇంటికి సంబంధించిన కొలతల ఆధారంగా మాత్రమే ఇంటి పన్ను విధించేవారు. ప్రస్తుతం నూతన విధానంతో ఇంటి ముందున్న ఖాళీ స్థలం కూడా పరిగణలోకి తీసుకోవడంతో మున్సిపల్‌లోని గృహ యజమానులకు మరింతగా పన్ను భారం పడనుంది.

మున్సిపల్ సిబ్బందితో సర్వే..

మున్సిపల్ శాఖ ఆదేశాలతో 2020లో మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇస్రో భువన్ సర్వేను తాత్కాలిక సిబ్బందితో నమోదు చేయించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులతో మున్సిపల్‌లోని ప్రతి ఇంటింటికీ వెళ్లి కొలతల ద్వారా పన్నులను విధించారు. ప్రస్తుతం నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా విధించిన పన్నుల భారం మరింతగా పెరగనుంది.

రాయికల్ మున్సిపాలిటి	
జనాభా :	19,500
వార్డులు :	12
గృహాలు :	4680

భారం తగ్గించాలి



మున్సిపల్‌లో నూతన విధానంతో గృహ యజమానులకు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికే మున్సిపల్‌గా మారిన తర్వాత ఇంటి పన్నులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇంటి ముందు ఖాళీ స్థలం ఉంటే సైతం పన్ను విధించడం సరికాదు.

– మ్యాకల అనురాధ, మున్సిపల్ కౌన్సిలర్

నిబంధనల మేరకే వసూళ్లు



ప్రభుత్వ నూతన చట్టం ప్రకారం రూపొందించిన విధి విధానాలతోనే మున్సిపల్‌లో ఇంటి పన్నులను వసూలు చేస్తున్నాం. గతంలో భువన్ సర్వే ద్వారా ఇంటి పన్నులను వసూలు చేశాం. ప్రస్తుతం ఇంటి ఆవరణలో ఖాళీ స్థలానికి సైతం పన్నులు వసూలు చేసేందుకు నిర్ణయించింది.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

ఉద్యోగులకు సీఎం కేసీఆర్ పెద్దపీట



ఎమ్మెల్యేను సన్మానిస్తున కాంట్రాక్ట్ లెక్చరర్లు

జగిత్యాల: ఉద్యోగులకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఆదుకున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్లు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉందని, దేశంలో ఎక్కడ లేని విధంగా పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జగిత్యాల పట్టణంలోని 18 వ వార్డుకు చెందిన గాజంగి లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కు మంజూరు కాగా, చెక్కును మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆమెకు అందజేశారు.

నల్గొండ కలెక్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన వినయ్‌కృష్ణారెడ్డి నల్గొండ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అమ్మమ్మ మంగళవారం మృతి చెందగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు సురేందర్‌నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి ఉన్నారు.

పంచాయతీ కార్మికుల గోడు పట్టదా.?



పంచాయతీ సిబ్బందికి మద్దతు తెలిపిన కృష్ణారావు

మల్లాపూర్: గ్రామ పంచాయతీ కార్మికులు, కారోబార్ల గోడు ప్రభుత్వానికి పట్టదా అని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు పూదరి నిషాంత్ కార్తికేయ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు వారు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. చాలిచాలనీ వేతనాలతో ఏళ్లుగా రాత్రింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్న కారోబార్లు, పారిశుధ్య కార్మికులు, పార్ట్‌టైం వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న అన్నికేటగిరిల ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనంతో క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి బాపూజీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల రాకేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు లవంగ శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని పంచాయతీ కారోబార్ల నిరసన

రాయికల్: గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులు, కారోబార్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కారోబార్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రాజేందర్, దొంతి రాజేందర్, కిశోర్, ప్రశాంత్, లక్ష్మణ్, రాజేందర్, జలేందర్, బాబా పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు అర్ధనగ్న నిరసన

ఇబ్రహీంపట్నం: తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు కొరుతు మంగళవారంల మోకాళ్లపై అర్ధనగ్నంగా కూర్చొని నిరసన తెలిపారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్, బీజేపీ నాయకులు పూదరి నిషంత్, కార్తికేయ, సంఘీభావం తెలిపారు.

న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె



పట్టణంలో సమావేశమైన పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య అన్నారు. సోమవారం విధుల్లో చేరకపోతే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని ప్రభుత్వం గడువు విధించగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జగిత్యాల శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను బెదిరించడం సరి కాదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఎట్టిపరిస్థితుల్లో సమ్మె విరమణ కుదరదని, న్యాయపరమైన డిమాండ్లను ఆమోదిస్తేనే సమ్మె విరమిస్తామన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమావేశమైన శుభమస్తు ఫంక్షన్‌హాల్‌కు డీపీవో దేవరాజు, అడిషనల్ పీడీ నరేశ్, డీఎల్‌పీవోలు, ఎంపీవోలు జాయినింగ్ పేపర్లు తీసుకుని పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వగా వారు జాయిన్ అవ్వకుండా తిరస్కరించారు. అనంతరం అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంతోష్, రవళి, వంశీధర్, రాజిరెడ్డి, రాజు, మల్లిఖార్జున్, నజీమ్, అక్బర్ పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు వేయాలని ఈఎన్‌సీకి వినతి

మల్యాల: మండలంలోని ముత్యంపేటలోని కొండగట్టు నుంచి ముత్యంపేట వరకు డబుల్ రోడ్డు వేయాలని ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సంజీవరావుకు వినతిపత్రం సమర్పించారు. మల్యాల నుంచి గుడిపేట మీదుగా కొండగట్టు ఎస్ టర్నింగ్ వరకు బీటీ రోడ్డు వేయాలని కోరగా, సానుకూలంగా స్పందించి, రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు.

భారత రాజ్యాంగం పుస్తకాలు ప్రతి పౌరుడికీ అందజేయాలి

మల్యాల: భారతీయ పౌరులందరికీ భారత రాజ్యాంగం పుస్తకాలు అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు ఉపేందర్ అన్నారు. మండల తహసీల్దార్ సుజాతకు బుధవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తేనే ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కులు వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్ డి.శివ, కె.అజయ్, అనుదీప్, తిరుపతి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావుకు నివాళి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు తండ్రి, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్మికుల, రైతుల సంక్షేమానికి రాజేశ్వర్‌రావు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లోక శశిధర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, గుండారపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

ఇబ్రహీంపట్నం: ఇంటింటికీ తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో ప్రభు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ, సర్పంచ్ నేమూరి లత, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వెల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ బాబా ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్‌కు చెందిన ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో డాక్టర్ హర్షిత్ కుమార్ చౌదరి, క్యాంపు కో ఆర్డినేటర్ తిప్పని కుమార్, పీఆర్‌వో బోనగిరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో రేణుకాఎల్లమ్మ తల్లి బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని డప్పుల చప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి రేణుకాఎల్లమ్మతల్లి ఆలయంలో బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురకంటి స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో రేణుకాఎల్లమ్మ బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో గౌడ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యార్థుల ప్రభంజనం



వినీతను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

జగిత్యాల: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అల్ఫోర్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 466/470, కదారి రమ్య 466, సంగ రక్షణ 466, బైపీసీలో సబూర నసీమ్ 433/440, సీఈసీలో మదీన నసీర్ 489/500, ఎంఈసీలో 482/500, సెకండియర్ ఎంపీసీలో జి.వినీత 992/1000, టి.స్ఫూర్తి 990, బైపీసీలో వైష్ణవి 978, సీఈసీ విభాగంలో మని వివేక్ 955 సాధించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి వారిని అభినందించారు.

నవ్య కళాశాలలో...

జిల్లా కేంద్రంలోని నవ్య కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో జూపాక మాధురి 466/470 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించగా, బానుక దివ్య 465/470, సెకండ్ ఇయర్ బైపీసీలో సరిగల శ్రీయ 985/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపల్ గాలిపల్లి ఈశ్వర్ అభినందించారు.

సత్తా చాటిన కోరుట్ల విద్యార్థులు



విజయ సంకేతం చూపుతున్న మాస్ట్రో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు

కోరుట్ల: పట్టణానికి చెందిన మాస్ట్రో జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ సత్తా చాటారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని సిహెచ్. రష్మిత 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఎంపీసీ సెకండియర్‌లో ఎస్ వైష్ణవి 986 మార్కులు సాధించింది. బైపీసీ సెకండియర్‌లో బి. ప్రతిభ 980 మార్కులు, సీఈసీ సెకండియర్‌లో ఏ. దీప్తినందన 983 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో ఏ. శ్రీనిధి 464 మార్కులు, బైపీసీలో తస్లీం 425 మార్కులు, సీఈసీలో ఎం. స్నేహ, ఏ. హిందూ 481 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చాటిన పీఆర్‌బీఎం విద్యార్థులు

పోతని రాజేశ్ బాబు మెమోరియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో ఎక్కల్‌దేవి కీర్తన 985 మార్కులు, బైపీసీలో గోనె శ్రీదేవి 980 మార్కులు సీఈసీలో తడుక రాహుల్ ,తోట లాస్యలు 953 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో ఎంపీసి విభాగంలో గాజుల నిఖిత 462 మార్కులు, బైపిసిలో సాఫియా నాజ్ 418 మార్కులు, సీఈసిలో అతన 485 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్,అధ్యాపకులు అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

పట్టణానికి చెందిన కోరుట్ల శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో సెకండియర్ ఎంపీసీలో రౌతు శ్రీజ 990 మార్కులు, బైపీసీలో రాచర్ల వైష్ణవి 998 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ శేఖర్ రెడ్డి తదితరులు అభినందించారు.



విక్టరీ సంకేతంతో శ్రీ చైతన్య విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ముత్యాల మనీషా



ద్యావనంది శరణ్య

మల్లాపూర్: తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియేట్ మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో సెకండీయర్ ఎంపీసీలో మల్లాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని ముత్యాల మనీషా(978/1000) మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్‌గా నిలిచింది. ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ ప్రభంజనం సృష్టించింది. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కోరుట్ల రూరల్: ఇంటర్ ఫలితాల్లో కల్లూరు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో యం. సుప్రజ 978 మార్కులు, డి. నిఖిల్ 970 మార్కులు సాధించారు. సెకండియర్ బైపీసీ విభాగంలో సీహెచ్. అంజు 955 మార్కులు, కే. సుచిత్ర 946 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య, అధ్యాపకులు అభినందించారు.

గొల్లపల్లి(పెగడపల్లి): ఇంటర్ ఫలితాల్లో పెగడపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో మొత్తం 118 మందికి గానూ 90 మంది పాసయ్యారు. 77 శాతం ఉత్తీర్ణత సాధించగా,రెండో సంవత్సరం నుండి 132 మందికి గానూ 126 మంది పాసయ్యారు. 96 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రవి,అధ్యాపకులు అభినందించారు.

గొల్లపల్లి: ఇంటర్ ఫలితాల్లో గొల్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బొంకూర్ గ్రామానికి చెందిన ద్యావానంది శరణ్య ఎంపీసీ సెకండీయర్ పలితాలలో రాష్ట్ర స్థాయిలో(మోడల్ స్కూల్ విభాగం)లో 985 మార్కులు తెచ్చుకుని రెండో స్థానం సాధించింది. ఫలితాల్లో మోడల్ స్కూల్ 90.4శాతం సాధించడంతో పాటుగా జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

రాయికల్: ఇంటర్ ఫలితాల్లో ఇటిక్యాల మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో నవిత 461, రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్, బైపీసీలో.గంగోత్రి430, బీమరాజు,430 సీఈసీలో నిశశ్రీ 440, సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో 962 హర్షిత, బైపీసీలో 967 శ్రీజ, సీఈసీలో 963 వినీష ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు



గొల్లపల్లి: విద్యార్థులను అభినంధిస్తున్న ప్రిన్సిపాల్

మల్లాపూర్: ఇంటర్ ఫలితాల్లో మల్లాపూర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఫస్ట్ ఇయర్‌లో 125మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, 75.2 శాతంతో 94మంది ఉత్తీర్ణులయ్యారని, సెకండీయర్‌లో 134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, 90శాతంతో 121మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఎండీ.కాలిక్ తెలిపారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ టాపర్‌గా చందనగిరి మణిదీప్(914/1000), బైపీసీ టాపర్‌గా జుపాక భార్గవి(931/1000), సీఈసీ టాఫర్‌గా గొల్లపల్లి రాహుల్ (961/1000)గా నిలిచారు. ఫస్టీయర్ బైపీసీ టాపర్‌గా అఖిల(366/440), సీఈసీ టాపర్‌గా శాంతికుమార్(379/600)గా నిలిచారు.

కథలాపూర్: ఇంటర్ ఫలితాల్లో కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు త్తా చాటారని ప్రిన్సిపాళ్లు గొనుర్ రహమాన్, తాటికొండ నరేశ్ తెలిపారు. మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ఫస్టీయర్‌లో 81 శాతం, సెకండీయర్‌లో 95 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

గొల్లపల్లి: ఇంటర్ ఫలితాల్లో గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.ద్వితీయ సంవత్సరం సైన్స్‌గ్రూప్‌లో 65 పరీక్ష రాయగా 64 మంది ఉత్తీర్ణత సాధించారు.ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ గ్రూప్‌లో 86 మంది విద్యార్థులకు 47 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల రూరల్: ఇంటర్ ఫలితాల్లో కల్లూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో బి. శిరీష 452 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఇంటర్ సెకండియర్ బైపీసీ విభాగంలో బి. అంజలి 966 మార్కులు సాధించింది. ఫస్ట్ ఇయర్లో 9 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. సెకండియర్‌లో 6గురు విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్‌వో సుమలత, అధ్యాపకులు అభినందించారు.